క్లుప్తంగా

నేడు 2 కె రన్

భాగ్యనగర్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో 2కె రన్ నిర్వహిస్తున్నట్లు కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ సురేందర్‌గౌడ్ తెలిపారు. కూకట్‌పల్లి ఐడియల్ చెరువు రోడ్డులో ఉదయం 6 గంటలకు 2కె రన్ ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌లు హాజరు కానున్నట్లు తెలిపారు.

నేడు భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పియఫ్)కార్యాలయంలో భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ పీఎఫ్ కమీషనర్ డాక్టర్ హేమంత్ తెలిపారు. సోమవారం కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్‌టీసీ బస్ టెర్మినల్‌లోని రెండవ అంతస్తులో గల పియఫ్ కార్యాలయంలో ఉంటుందని ఖాతాదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవటమే కాకుండా సలహాలు, సూచనలు అందించాలని కోరారు. కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బీహెచ్‌యిఎల్, జీడిమెట్ల, సనత్‌నగర్ ఖాతాదారులు పాల్గొవచ్చని అన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



మూసాపేట: మూసాపేటలో న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దివ్యాంగులకు పెన్షన్ 3016 నుంచి 4116కు పెంచుతూ చేసిన ప్రకటనకు దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తూ పాలాభిషేకం చేశామని సంస్థ అధ్యక్షులు వేల్పుగొండ వెంకటస్వామి తెలిపారు. వికలాంగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకొని పెన్షన్ పెంచటం శుభపరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చిరంజీవి, సభ్యులు నాగేశ్వరరావు, నాగమణి, ఆనంద్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్ 1 పరీక్ష



పరీక్ష కేంద్రం వద్ద పోలీసు సిబ్బందికి సూచనలు అందజేస్తున్న ఏసీపి చంద్రశేఖర్

భాగ్యనగర్‌కాలనీ: తెలంగాణ గ్రూప్ 1 ప్రాథమిక పరీక్ష ఆదివారం కూకట్‌పల్లిలో ప్రశాంతంగా జరిగింది. కూకట్‌పల్లి జంట సర్కిల్‌ల పరిధిలోని 8 సెంటర్లను ఏర్పాటు చేశారు. మొత్తం అభ్యర్థులు 3360 మంది హాజరు కావాల్సి ఉండగా 1986 మంది హాజరు కాగా 1374 మంది గైర్హాజరు అయ్యారు. గంట ముందే పరీక్ష కేంద్రానికి అనుమతి ఇచ్చారు. దీంతో అభ్యర్థులు సమయానికి కేంద్రాలకు చేరుకున్నారు. ముగ్గురు అభ్యర్థులు అరగంట ఆలస్యం కావటంతో వారిని పరీక్షకు అనుమతి ఇవ్వకపోవటంతో వారు తిరిగి వెళ్లి పోయారు. ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా కూకట్‌పల్లి పోలీసులు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. ఆయా పరీక్షా కేంద్రాలను కూకట్‌పల్లి ఏసీపి చంద్రశేఖర్, సిఐ సురేందర్ గౌడ్, పోలీస్ సిబ్బంది పర్యవేక్షించారు.

ఉత్సాహంగా 5కె రన్



కూకట్‌పల్లి: శిల్పా బృందావన్ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవం సందర్భంగా 5కె రన్ శిల్పాధామ్‌లో ఆదివారం నిర్వహించారు. స్థానిక ప్రజలు రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు టమాట రూ.35, పచ్చిమిర్చి 60, బెండ 50, కాకర 60, దొండ 40, దోస 30, ఆలు 25, చామ 50, కీర 35, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 150, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 25, క్యారెట్ 60, చిక్కుడు 70, ఉల్లి 100 (4 కేజీలు), ములక్కాయలు (2) 10, క్యాలీఫ్లవర్ (1) 50 సొరకాయ (కేజీ) 30, అల్లం 220, వెల్లుల్లి 150.

ఆర్టీసీ బస్‌పాస్‌ల వివరాలు

రాయదుర్గం: టీఎస్‌ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు అందిస్తున్న స్నేహపూరిత రాయితీ బస్‌పాస్‌ల వివరాలు.

బస్‌పాస్ రకం	టారిఫ్
జనరల్, ఆర్డీనరీ, మెట్రో	రూ.1,150–రూ.1,350
స్టూడెంట్, జనరల్	రూ.450
ఎన్‌జీఓస్, ఆర్డినరీ, మెట్రో	రూ.450–రూ.60

విద్యార్థులకు సమస్యల స్వాగతం

- అడ్మిషన్స్ ఫుల్లు... వసతులు నిల్లు...
- నేడు తెరుచుకోనున్న ప్రభుత్వ పాఠశాలు..



మూసాపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాల

మూసాపేట: ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు ప్రతి ఏడాది పెరుగుతూనే ఉన్నాయి. వేసవి సెలవులు ముగిసి ఆనందంగా వచ్చే విద్యార్థులకు సమస్యలే స్వాగతం పలుకుతున్నాయి. ప్రతి విద్యా సంవత్సరంలో కోట్లు ఖర్చు పెడుతున్నామని ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రగల్భాలు చేస్తున్నప్పటికీ అవి ప్రచారం వరకే ఉన్నాయి. బల్లలు, బాత్రూంలు, తరగతి గదులు, ఉపాధ్యాయుల కొరత, ఆట స్థలాలు, మధ్యాహ్న బోజనం ఇలా ప్రతిదీ పాఠశాలలో ఉంటున్నాయి. సోమవారం పాఠశాలలు తెరుచుకోనున్నాయి. అయినా ఇవే సమస్యలు విద్యార్థులకు స్వాగతం పలకనున్నాయి. కరోనా తరువాత ప్రభుత్వ పాఠశాలలకు అడ్మిషన్లు పెరిగినా సౌకర్యాలు కల్పించడంలో మాత్రం ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని పాఠశాలల తరగతి గదులు శిథిలావస్థకు చేరుకుని పడిపోవడానికి సిద్ధంగా ఉన్నా వాటికి కనీస మరమ్మతులు చేయడం లేదు. ఇలా మూసాపేటలో ఉన్న ప్రభుత్వ ప్రైమరీ, ఉన్నత పాఠశాలలు అధ్వాన్నంగా ఉన్నాయి.

పడిపోవడానికి సిద్ధంగా ఉన్న పాఠశాల...

మూసాపేటలోని టి. అంజయ్యనగర్‌లోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలోని తరగతి గదులు శిథిలావస్థలకు చేరుకుని పడిపోవడానికి సిద్ధంగా ఉంది. దీంతో పాఠశాలకు వచ్చే చిన్నారులకు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళనకు గురవుతున్నారు. ఈ పాఠశాలలో ఉన్నవి రెండే గదులు. ఓ గదిలో మూడు తరగతులు, టీచర్స్ రూం, మరో గదిలో మరో రెండు తరగతులు, ప్రధానోపాధ్యాయుల రూం, స్టోర్ రూంలు ఉంటాయి. ఇంకా భోజనం అయితే విద్యార్థులు తిన్న తరువాత అదే రూంలో ఉపాధ్యాయులు తినాల్సి వస్తుంది. వర్ష కాలంలో శ్లాబు పెచ్చులు ఊడి మీద పడుతూ ఉంటాయి. ఉపాధ్యాయులు చందాలు వేసుకుని మరమ్మతులు చేసుకుని బిక్కు బిక్కుమంటూ ఉంటున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా సమస్యను వివరిస్తున్నా పట్టించుకోవడం లేదు.

కింద కూర్చొని పాఠాలు వింటున్న విద్యార్థులు...

మూసాపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సరిపడా బల్లలు లేక నేలపై కూర్చొని పాఠాలు వింటున్నారు. గత రెండు సంవత్సరాలుగా అలాగే చదివిన విద్యార్థులకు ఈ యేడాది అలాగే చదివే పరిస్థితి ఉంది. మరికొన్ని గదుల్లో బల్లలు విరిగిపోయినా అలాగే కూర్చొని పాఠాలు వింటున్నారు. ఈ పాఠశాలకు 6 తరగతి గదులు కావాలని గత కొన్ని సంవత్సరాలుగా అడుగుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదు. ఉపాధ్యాయుల కొరత కూడా ఉంది. ఉన్న టీచర్స్ ఎక్కువ వర్క్ చేయాల్సి వస్తుంది. తరగతి గదులే లేవంటే ఇంకా ఆట స్థలాల పరిస్థితి దేవుడెరుగు.



బల్లలు లేకుండా ఖాళీగా ఉన్న ప్రభుత్వ బాలుర పాఠశాల తరగతి గది

సదుపాయాల కొరత.....

మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ సంవత్సరంలో సుమారుగా 900 మందికి పైగా విద్యార్థులు చేరే అవకాశం ఉంది. ఒక్కో తరగతికి సుమారు మూడు సెక్షన్స్ ఉండే అవకాశం ఉంది. ప్రతి సంవత్సరం అత్యుత్తమ మార్కులతో ప్రథమంగా నిలిచే పాఠశాలలో 10 తరగతి గదులు కావాలి, తెలుగు, హింది, సోషల్ టీచర్స్ కావాలి, కంప్యూటర్స్ లేవు, వాష్‌రూంలు ఎన్‌జీఓ చూసుకుంటుంది. ప్రతి సంవత్సరం అడ్మిషన్స్ పెరుగుతున్నాయి. కానీ పాఠశాలలో సమస్యలను మాత్రం పరిష్కరించడం లేదు.

ప్రైమరీకి వెల్లువలా అడ్మిషన్స్....

ప్రైమరీ పాఠశాలకు 600 పై చిలుకు విద్యార్థులు వచ్చే అవకాశం ఉందని, నో అడ్మిషన్స్ బోర్డు పెట్టే పరిస్థితి రావొచ్చేమోనని ఉపాధ్యాయులు ఆందోళన పడుతున్నారంటే ప్రభుత్వ పాఠశాలకు డిమాండ్ అర్థం చేసుకోవచ్చు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా వెళ్తున్నారంటే స్థానికంగా ఎక్కువగా వలస కుటుంబాలే జీవనం సాగిస్తున్నారు. వేలాది రూపాయాలు పెట్టి చదివించే స్థోమత లేక ప్రభుత్వ పాఠశాలలో కూడా భోదన బాగుందనే విద్యార్థులను పంపిస్తున్నారు. ఇంకా మరిన్ని వసతులు కల్పించి ఉపాధ్యాయుల ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేస్తే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాల వైపే మొగ్గు చూపుతారు. ఇంకా ఐదుగురు టీచర్స్ తో పాటు విద్యార్థులు ఎక్కువగా ఉండటం వల్ల సెక్షన్స్ పెరగడంతో మరో 5 రూంలు అవసరం ఉండనున్నాయి.

ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలి



మోతీనగర్ కమ్యూనిటీ హాలులో వృద్ధులకు ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరం

మోతీనగర్: వయోవృద్ధులు తరచూ వైద్యులను సంప్రదించి ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించుకొని వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని మోతీనగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్‌చైర్మన్ డాక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం మోతీనగర్‌కమిటి హాలులో ఎంసీఏ సాయిప్రసాద్ సేవా ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో వయో వృద్ధులకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100 మంది వయో వృద్ధులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు అంజిరెడ్డి మాట్లాడుతూ వయోవృద్ధులు చిన్నపిల్లలతో సమానమని వారికి తరచు వైద్య పరీక్షలు చేయిస్తూ వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. ప్రతి ఆదివారం మోతీనగర్‌కమ్యూనిటి హాలులో నిర్వహించే ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బి. జగన్నాథం గౌడ్, పిఎస్‌రెడ్డి, ఈ బ్రహ్మానంద రెడ్డి, సూర్యనారాయణ శర్మ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామం సందర్శన వేళలు

గచ్చిబౌలి: మాదాపూర్‌లోని శిల్పారామం ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. వారాంతంలో సాయంత్రం 5.30 గంటల నుంచి శిల్పారామంలోని ఆంఫీథియేటర్‌లో సందర్శకుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఫీజుల ఇలా

పెద్దలకు	రూ.60 ,	పిల్లలకు.	రూ.20
బోటింగ్ ఛార్జీలు	రూ.30		

- బ్యాటరీ ఆపరేటెడ్ కారు చార్జీలు రూ.15
- ఎడ్లబండి ఒక్కరికి ఛార్జీలు.....రూ.20

ఉచిత వైద్య శిబిరం

హఫీజ్‌పేట్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్‌లో రఘునాథ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్ మాట్లాడుతూ.. పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని వారందరికి ఉచితంగా వైద్యం అందించడం కోసం శిబిరం నిర్వహించామన్నారు.శిబిరంలో పాల్గొన్న వారికి గౌతమ్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ గౌతమ్ వైద్య పరీక్షలు పలు సూచనలు, సలహాలు చేశారు.

నేడు జీఎల్ఐటీలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం

రాయదుర్గం: పాలిసెట్–2023 ఫలితాల వెల్లడితో రాయదుర్గంలోని గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ (జీఐఎల్‌టీ)లో అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించడంతో ఇక సందడి వాతావరణం కనిపించనుంది. రాష్ట్రంలో ఏకైక గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ విద్యాసంస్థ కొనసాగుతోంది. దీంట్లో చదివిన వారందరికీ ఉపాధి అవకాశాలు మెండుగా ఉండడంతో ఈ ఇన్‌స్టిట్యూట్‌కు మరింత ప్రాధాన్యత నెలకొంది.

- రాయదుర్గంలోని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీలో సోమవారం విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశంపై ఈ అవగాహన కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఈ అవగాహనా కార్యక్రమంలో 24 కోర్సుల గురించి వివరించడంతో జీఐఎల్‌టీలో నిర్వహించే కోర్సులు కల్పిస్తున్న సౌకర్యాలపై వివరిస్తారు.

ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం

జగద్గిరిగుట్ట: ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని మైసమ్మనగర్ బి బ్లాక్‌లో ఆదివారం సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అంజనేయులు, జనరల్ సెక్రటరీ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమకారుల కుటుంబాలకు అండగా ఉంటాం

కుత్బుల్లాపూర్: ఉద్యమకారుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతినగర్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు గొల్ల విద్యాసాగర్‌యాదవ్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆదివారం ప్రగతినగర్‌లోని విద్యాసాగర్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో ఉద్యమాలు, రాస్తారోకోల్లో పాల్గొనడమే కాకుండా పోలీసుల లాఠీ దెబ్బలు తిన్న విద్యాసాగర్ సేవలను రాష్ట్ర ప్రజలు ఎప్పుడు గుర్తించుకుంటారన్నారు. ప్రభుత్వ పరంగా ఉద్యమకారుల కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. బీఆర్‌ఎస్ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, సీనియర్ నాయకులు కొలన్ గోపాల్ రెడ్డి, సుధీర్ రెడ్డి, కార్పొరేటర్లు తదితరులు ఉన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మస్థైర్యం పెంపొందుతుంది



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

సుభాష్‌నగర్: మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందుతుందని మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి అన్నారు. సూరారం బ్లూమింగ్ బడ్స్ కాన్వెంట్ లో ఆదివారం కరాటే మాస్టర్ శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి కరాటే కుంగ్‌ఫూ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుండే మార్షల్ ఆర్ట్స్‌లో తర్ఫీదు ఇప్పించాలని, దీంతో వారిలో శరీరక పటుత్వం పెంపొందడంతో పాటు చురుకుదనం పెరుగుతుందన్నారు. కరాటే మాస్టర్లు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ మాట్లాడొద్దన్నందుకు..

- ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

జవహర్‌నగర్: ఫోన్ మాట్లాడవద్దని తల్లి వారించడంతో యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సాకు చెందిన మేనకా నాయక్, భర్త మున్నా నాయక్‌ల కుమారుడు అనిల్(18)తో జమ్మిగడ్డలో నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా అనిల్ తరచూ ఫోన్‌లో మాట్లాడుతున్నాడని తల్లి మేనకానాయక్ వద్దని వారించింది. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అనిల్ సీలింగ్ రాడ్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూడగా తలుపులు తీయకపోవడంతో చుట్టుపక్కల వారి సహాయంతో తలుపులు తెరిచారు. అప్పటికే మృతిచెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యమంలో కవులు, రచయితల పాత్ర గొప్పది

సాహితీ ఉత్సవాలను ప్రారంభించిన జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహరెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కవులు, కళాకారుల పాత్ర గొప్పదని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహరెడ్డి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో తెలంగాణ సాహిత్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కవులు, కవయిత్రులు, సాహితీవేత్తలు తమ పద్య, వచన కవిత్వాలతో తెలంగాణ ఔన్నత్యాన్ని ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహరెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కవులు రాసిన పాటలు, పాడిన పాటలు ప్రజల్లో ఎంతో ఉత్తేజాన్ని నింపాయన్నారు. కవులను ప్రభుత్వం గుర్తించడంతో పాటు వారికి తగిన ప్రాధాన్యతనిస్తోందని ఆయన పేర్కొన్నారు. స్వరాష్ట్రంలో మన సాహిత్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, తెలంగాణ తేజో మూర్తుల పేరుమీద పురస్కారాలను అందజేస్తోందని తెలిపారు. రాష్ట్రం అవతరించి పదేళ్లు కావొస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సాహితీ దినోత్సవాన్ని జిల్లాలో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని, కవుల కవితా సంపదతో విరాజిల్లుతోందన్నారు. తెలంగాణ పోరాటాల గడ్డ అని, సాహితీరంగంలో తమదైన ముద్ర వేసిన మొదట కావ్యం, మొదటి కవి అందరూ మన తెలంగాణవాదులేనన్నారు. ఈ సందర్భంగా కవులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు, పారితోషికాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి బలరామారావు, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వర్‌రావు, శామీర్‌పేట ఎంపీపీ దాసరి ఎల్లుబాయి, శామీర్‌పేట జెడ్పీటీసీ అనిత, మేడ్చల్ జెడ్పీటీసీ శైలజారెడ్డి, గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరెడ్డి, ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్మన్ పావని, కవులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన బీజేపీ యువమోర్చా, కూకట్‌పల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శి బి. శ్రీధర్

బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన బొట్టు శ్రీధర్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఆకర్షితులై కూకట్‌పల్లి డివిజన్‌కు చెందిన బీజేపీ యువమోర్చా, కూకట్‌పల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శి బి. శ్రీధర్‌తో పాటు పలువురు బీజేపీ కమిటి సభ్యులు బీఆర్‌యస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నాయకత్వంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని, ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు మాధవరం కృష్ణారావు చేసి చూపించారని, కళ్లముందు కనిపిస్తున్న అభివృద్ధి చూసి మెచ్చుకోక తప్పదని, అంతేకాకుండా ఎన్నో సంక్షేమ పథకాలతో నిరంతరం విద్యుత్ పంపిణీతో పరిశ్రమలు , పెట్టుబడులతో హైదరాబాద్ మహానగరం దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపారని అన్నారు. కూకట్‌పల్లి నియోజవకర్గ కోఆర్డినేటర్ సతీస్ అరోరా, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

అల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ సభ్యుల నియామకం



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేసిన మాజీ కార్పొరేటర్ వెంకళరావు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ షఫీ ఉద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో అల్లాపూర్ డివిజన్ కమిటీ సభ్యులు నియామకం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు, బి బ్లాక్ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేంద్రలు పాల్గొని నియామక పత్రాలు అందజేశారు. వైస్ ప్రెసిడెంట్‌లుగా మొహమ్మద్ మొయినుద్దీన్, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మయ్య, సుల్తాన్, జనరల్ సెక్రటరీలుగా గిరి, షషం కనకయ్య, ఎండి హుస్సేన్, నాగిరెడ్డి, షేక్ ఇమ్మా, సెక్రటరిలుగా రంగారావు, పండు రంగం పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలి



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: పాపారెడ్డి నగర్ కాలనీ శ్రీ వీరాంజనేయ శివాలయం ప్రాంగణంలోని కమ్యూనిటీ హాలులో ఆదివారం పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత రక్త దాన శిబిరం, ఉచిత ఆరోగ్య శిబిరాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, నార్నే శ్రీనివాసరావు, సిఐ క్రాంతి కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పేద ప్రజలకు సేవ చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎన్‌సి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ రమేష్, వివేకానందనగర్ డివిజన్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని నడిగడ్డతండాలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌కు కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. నడిగడ్డతాండలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెనకబడిన వర్గాలు గత 40 సంవత్సరాల నుంచి నివాసముంటున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ దీపాలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్, మంజీరా పైపులైన్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో దశరథ్ నాయక్, రత్నకుమార్, మోహన్ నాయక్, దేవనూరి నర్సింహ, కృష్ణానాయక్, చాకలి రాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్ సెంటర్ ఉపయోగించుకోవాలి

మేడ్చల్: వృథా సామాగ్రి సేకరణ కోసం నిర్వహిస్తున్న రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ ఆర్ఆర్ఆర్ సెంటర్ వార్డు ప్రజలు ఉపయోగించుకోవాలని పట్టణంలోని 14వ వార్డు కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఆయన కాలనీవాసులతో కలిసి ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను ప్రారంభించి వార్డులో పర్యటించి వృథా సామాగ్రి సేకరణపై అవగాహన కల్పించారు. ఇళ్లలో వృథాగా ఉండే చెక్క వస్తువులు, సామాగ్రి, బట్టలు, పుస్తకాలు వంటి ఉపయోగంలో లేని సామాగ్రి ఉన్న వారు సెంటర్‌లో ఇవ్వాలని కోరారు. సామాన్లను సెంటర్‌కు తీసుకువచ్చి ఇవ్వాలని ఆయన కోరారు. పర్యావరణం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు.